మత సామరస్యం వెల్లివిరియాలి

- ఏకాదశి, మొహర్రం సందర్భంగా కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మత సామరస్యం వెల్లివిరియాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోరారు. దానిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని సూచించారు. బుధవారం ఉపవాస దీక్షలతో, భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి జరుపుకుంటున్న హిందువులకు, హిందూ ముస్లింలు ఐక్యంగా జరుపుకుంటున్న మొహర్రం పర్వదినాలను పురస్కరించుకొని ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక ప్రకటనలో ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గంగా, జమునా సంస్కృతికి తెలంగాణ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కేసీఆర్ ప్రార్థించారు.

నిరుద్యోగుల పాలిట రేవంత్‌రెడ్డి శాపం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): సీఎంగా రేవంత్ రెడ్డి రావడం నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ధ్వజమెత్తారు. డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు ఎంతగా కోరినా ముఖ్యమంత్రి పెడచెవిన పెట్టారని ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ రెండు పరీక్షల మధ్య తక్కువ సమయం ఉన్నదని వివరించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఒకమాట అధికారంలోకి వచ్చాక మరో మాటగా వ్యవహరిస్తూ, నిరుద్యోగులపై లాఠీచార్జి చేయిస్తున్న సీఎం నియంతృత్వ పోకడలకు పోతున్నాడని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో రైతులపై దౌర్జన్యాలు

- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణ
- ఆత్మహత్యకు యత్నించిన రైతుకు పరామర్శ

ములుగు, జూలై 17: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో నిరుపేద రైతులపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. కొంత మంది కాంగ్రెస్ నాయకుల అండదండలతో భూకబ్జాదారులు అధికారులను లొంగదీసుకొని ఇష్టారీతిన వ్యవహరిస్తూ రైతులను చిత్రహింసలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. భూవివాదంలో ఆత్మహత్యకు యత్నించిన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన బండి కిష్టయ్యను హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం దవాఖానలో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. బాధిత రైతుకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. బండి కిష్టయ్య తన భూమికి హద్దులు చూపించాలని సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోగా, సర్వేకు వచ్చిన డీఐ మొదట సరిహద్దులు చూపి తరువాత కాంగ్రెస్ నేతల సూచనలతో సరిహద్దులు మార్చి తన పొలానికి దారి లేకుండా ఇబ్బందులకు గురి చేసి రూ. 20 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపించారు. తమకు కాంగ్రెస్ నేతల అండదండలు ఉన్నాయని, మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరని, మీరు ఎక్కడికి వెళ్లినా న్యాయం జరగదని బెదిరించి అన్యాయంగా పోలీస్ కేసు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారని, బాధితుడి భార్య చెప్పిందని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో అనేక చోట్ల కాంగ్రెస్ నేతల అండదండలతో అనేక దౌర్జన్యాలకు పాల్పడి నిరుపేద రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. వెంటనే విచారణ జరిపి బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో హరీశ్‌రావు సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

పటాన్‌చెరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఫిరాయింపు ఎమ్మెల్యేలు మాజీలయ్యేదాకా నిద్రపోము

మొదటిపేజీ తరువాయి...

రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇదేవిధంగా 12 మంది ఎమ్మెల్యేలను చేర్చుకొని బీఆర్ఎస్‌ను ఇబ్బందిపెట్టే కుట్రలు చేశారని చెప్పారు. ఎమ్మెల్యేలు పోయినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీ పని అయిపోలేదని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రావడంతోపాటు పదేండ్లు అద్భుతమైన పాలన అందించామని అన్నారు. ఇప్పుడు కూడా ఎవ్వరి కుట్రలు పనిచేయవని, ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని హరీశ్‌రావు తెలిపారు.

మహిపాల్‌రెడ్డికి ఎలా మనసొప్పిందో

తల్లిలా ఆదరించి మూడుసార్లు ఎమ్మెల్యేను చేసిన బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి మనసెలా ఒప్పిందో అర్థం కావడం లేదని హరీశ్‌రావు అన్నారు. మహిపాల్‌రెడ్డికి పార్టీ ఏమి తక్కువ చేసిందని ప్రశ్నించారు. పటాన్‌చెరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడితేనే ఆయన మూడు సార్లు ఎమ్మెల్యే అయ్యారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో పటాన్‌చెరు నియోజకవర్గానికి నిధుల వరద పారించి అభివృద్ధి చేశామని అన్నారు. మహిపాల్‌రెడ్డి పార్టీ నుంచి పోయినా బీఆర్ఎస్ క్యాడర్ గుండె ధైర్యాన్ని కోల్పోవద్దని హరీశ్‌రావు కోరారు. పటాన్‌చెరు నాయకులు, కార్యకర్తలకు పార్టీ, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంపై మళ్లీ గులాబీజెండా ఎగరడం ఖాయమని అన్నారు.

పంట రుణమాఫీ జీవో మార్చాల్సిందే

రేవంత్‌రెడ్డి సర్కార్ పంట రుణమాఫీ జీవోను మార్చాల్సిందేనని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు, కుటుంబాల ఆధారంగా పంట రుణమాఫీ చేస్తామని జీవో ఇచ్చి, ఇప్పుడేమో రేషన్‌కార్డు వద్దు పాస్‌బుక్ చాలు అంటున్నారని చెప్పారు. రుణమాఫీకి సీఎం నోటిమాటలు చెల్లవని, కొత్తజీవోలు కావాలని అన్నారు. పీఎం కిసాన్ నిబంధనలు లేకుండానే రుణమాఫీ చేయాలని హరీశ్‌రావు కోరారు.

ఆరునూరైనా మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే

ఆరునూరైనా భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఏ రాష్ట్రంలోనూ రెండోసారి అధికారంలోకి రాలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురికాకుండా పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీ నాయకత్వం, కార్యకర్తల సంక్షేమంపై మరింత దృష్టిపెడతామని తెలిపారు. పార్టీ క్యాడర్‌ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే సత్యనారాయణ, కార్పొరేటర్లు సింధూ ఆదర్శ్‌రెడ్డి, మెట్టుకుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్లు రోజాబాల్‌రెడ్డి, లలితాసోమిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ

ఎల్బీనగర్, జూలై 17: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో దవాఖానకు వెళ్లిన కేటీఆర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేటీఆర్‌తో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి కమలాసుధీర్‌రెడ్డి ఉన్నారు.

పూరీ జగన్నాథ్‌పై చర్యలు తీసుకోండి

- ఎల్బీనగర్ డీసీపీకి బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న రజితారెడ్డి, సతీశ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ): డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు రజితారెడ్డి, గర్రెపల్లి సతీశ్ బుధవారం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. పూరీ జగన్నాథ్ తీసిన డబుల్ ఇస్మార్ట్ సినిమాలోని ఓ ఐటమ్ సాంగ్‌లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలను వాడి యావత్ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా చేశారని పేర్కొన్నారు. పాటలో కేసీఆర్ మాటలను వెంటనే తొలగించాలని లేదంటే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కనీస విలువలతో సినిమాలు తీయాలని డైరెక్టర్‌కు సూచించారు. పూరీపై కేసు నమోదు చేయాలని డీసీపీకి విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు రెండు కండ్ల సిద్ధాంతాన్ని నిజం చేసేందుకు రేవంత్ తహతహ

- గురుశిష్యులిద్దరూ తెలంగాణ అస్తిత్వాన్ని కాటగలిపే ప్రయత్నం
- అంతర్గత ఒప్పందంతోనే కాంగ్రెస్, బీజేపీ చెరి సగం సీట్లు
- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): చంద్రబాబు రెండు కండ్ల సిద్ధాంతాన్ని నిజం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తహతహలాడుతున్నాడని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. గురుశిష్యులిద్దరూ తెలంగాణ అస్తిత్వాన్ని కాటగలపాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో కొత్త దనమేమీ లేదన్నారు. బుధవారం ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సంచలన విషయాలు వెల్లడించారు. కోదండరాంరెడ్డి గారూ అని సంబోధించినప్పుడు మోతీలాల్ గారూ అని, బక్క జడ్సన్‌గారూ అని ఎందుకు అనరని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. నిరాహార దీక్ష చేస్తున్నది దళితులు, లంబాడీలు అని మాట్లాడటం ఏమిటి? అని ప్రశ్నించారు. ఆధిపత్యవర్గాల ప్రతినిధిగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'నేను పాలకుడిని కాదు సేవకుడిని' అని గొప్పలు చెప్పుకున్న రేవంత్‌రెడ్డి నిలువెల్లా అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు.

చంద్రబాబు వారసుడే రేవంత్‌రెడ్డి..

చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఇద్దరూ గురుశిష్యులనే విషయం లోకమంతా తెలుసని ప్రొఫెసర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ పదాన్నే నిషేధించి, తెలంగాణ పాటను బెల్లి లలితక్క రూపంలో ముక్కలు చేసిన చంద్రబాబును తెలంగాణ ఎట్లా నమ్ముతుందని ప్రశ్నించారు. బాబు వారసుడే రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు.

ఒప్పందంతోనే బీజేపీకి 8 ఎంపీ సీట్లు

తెలంగాణ అస్తిత్వాన్ని క్లోజ్ చేయాలని, బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని పార్లమెంట్ ఎన్నికల ముందు ఒప్పందం జరిగిందని ప్రొఫెసర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు చెరో 8 సీట్లను గెలిచాయన్నారు. నిజానికి ఇందులో తన గురువైన చంద్రబాబు కలను నిజం చేయాలనే కుట్ర దాగి ఉన్నదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి సహకరించినట్టే రేపు చంద్రబాబు కూటమికి సహకరిస్తాడని, అందులో ఎలాంటి అనుమానమూ లేదన్నారు. చంద్రబాబు కూటమిలో భాగమైన జనసేన, బీజేపీ కలిసి తెలంగాణలో తమ పూర్వచరిత్రకు పూర్వవైభవం తీసుకురావాలని చూస్తున్నాయని ఆరోపించారు.

రెడ్డి వర్గం సీఎం కావాలని కోదండరాంరెడ్డి అనుకున్నడు..

తన సామాజిక వర్గానికి చెందిన జైపాల్‌రెడ్డినో, జానారెడ్డినో తెలంగాణకు సీఎం కావాలని నాడు సోనియాగాంధీకి కోదండరాంరెడ్డి చెప్పిండు. అయితే పరిస్థితులు తలకిందులై కేసీఆర్ సీఎం కాగానే కోదండరాంరెడ్డి ఆటలు సాగలేదు. అందుకే పగబట్టినట్టు వ్యవహరించాడని వినోద్‌కుమార్ వెల్లడించారు.

జన్మలో కాంగ్రెస్‌కు ఓటెయ్యం

మొదటిపేజీ తరువాయి...

ప్రమాణం చేస్తున్నాం' అంటూ పేర్కొంటూ ప్రకటన విడుదల చేశారు. ఇతమిద్ధంగా పేర్లంటూ లేని ఆ లేఖ పూర్తి సారాంశం ఇలా..

శ్రీయత గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, ఎమ్మెల్సీలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు నమస్కరించి తెలియజేయునది..

మేము డీఎస్ డీఎస్సీ స్టూడెంట్స్. గత నెల రోజులుగా డీఎస్సీ పోస్ట్‌పోన్ గురించి రోడ్లమీద ధర్నాలు చేయడం జరుగుతున్నది. మీరు ఇంతవరకు స్పందించడం లేదు. పైగా మా వెనుక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని చెప్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు అందరూ కాంగ్రెస్ పార్టీలో చేరినంక ఎవరు మాకు సపోర్ట్‌గా ఉన్నది?. మీరు దాటవేయడానికి చెప్పే ముచ్చటని అర్థమవుతున్నది. పోస్టులు అమ్ముకున్నారు అంటున్నారు. అది ఎంతవరకు నిజమో మీకే తెలియాలి. పరీక్ష పోస్ట్‌పోన్ చేయడం వల్ల మీకు వచ్చే నష్టమేమిటో మాకు అర్థం కావట్లేదు. ఒకటి మాత్రం చెప్తున్నాం. రెండు లక్షల తొంభై వేల మంది డీఎస్సీ రాస్తున్నారు. మీరు 11వేల పోస్టులు వేశారు. రెండు లక్షల తొంభై వేల మందిలో 11వేల మంది మాత్రమే జాబులు కొడతారు. మిగతా నిరుద్యోగులు మీ కాంగ్రెస్ పతనానికి కారకులవుతారు గుర్తుపెట్టుకోండి. రేపు ఎగ్జామ్ మీరు జరపాలని ఫిక్స్ అయ్యారని, పోస్ట్‌పోన్ చేయరని మాకు అర్థమవుతున్నది. నీకు, కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు మా చెప్పుతో మేమే కొట్టుకోవాలి. గుర్తుపెట్టుకోండి కాంగ్రెస్ నాయకులారా.. సర్పంచ్ ఎలక్షన్లు ఉన్నాయి. ఎంపీటీసీ ఉంది.. జడ్పీటీసీ ఎన్నికలున్నాయి. ఏ కాంగ్రెస్ నాయకుడికీ ఓటు వేయం. అడుగడుగునా మీకు అడ్డుపడుతం. ఒక్కొక్క స్టూడెంట్ తలుచుకుంటే ఏమి జరుగుతుందో కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే అర్థమవుతుంది. నిరుద్యోగులు రోడ్లమీద తిరుగుతుంటే సిగ్గు లేకుండా నవ్వుతూ ఫోన్లో ముచ్చట్లు చెప్తున్నారు. మీలాంటి నాయకులను ఎనుకున్నందుకు మమ్మల్నిమేము కొట్టుకోవాలి. ఇక నుంచి చూడండి. మా ఆత్మసాక్షిగా చెబుతున్నాం. జన్మలో కాంగ్రెస్‌కు ఓటు వేయం. మా తల్లిదండ్రులను, మా చుట్టాలను, అన్నదమ్ములను కలిసి ప్రతి ఒక్కరికీ చెప్తాం. కాంగ్రెస్‌కు ఓటేస్తే కలిగే నష్టాలపై ప్రచారం చేస్తాం. మామీద పోలీసులుచేసిన దాడిపై, మా అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లంతా కలిసి రోడ్లమీద చేసిన ధర్నాలకు, ఆందోళనలకు మీరు స్పందించలేకపోయారు. ఖబడ్దార్ రేవంత్ రెడ్డీ.. గుర్తుపెట్టుకో..! నీ పతనం మొదలైంది. మేము కాంగ్రెస్ వస్తే బాగుపడ్తం అనుకున్నం. చదువుకునే టైం ఇస్తలేరంటే రానురాను మా పరిస్థితి ఏమిటో అర్థమవుతున్నది.నువ్వు డబ్బులే పంచుకో ఏమన్నా చేసుకో..! ఎలక్షన్ల ఎవ్వరం నీకు ఓటు వెయ్యం. కాంగ్రెస్‌కు ఓటేయనియ్యం. మేము ఇంతవరకు ఏ పార్టీ శ్రేణుల దగ్గరికి పోలేదు. మద్దతు ఇవ్వాలని కూడా అడగలేదు. ఎందుకంటే కాంగ్రెస్ న్యాయం చేస్తదని నమ్మినం. కానీ మీలాంటి మూర్ఖులను ఎన్నుకున్నందుకు మాకు బాగా బుద్ధి చెప్పారు. డీఎస్సీ పోస్ట్‌పోన్ చేస్తేనే లెక్క. లేకపోతే నీ పతనం మొదలైంది చూసుకోండి.

– మీ తెలంగాణ పోరులైన నిరుద్యోగులు.. డీఎస్సీ అభ్యర్థులు

ప్రజాభవనా? పార్టీ ఆఫీసా?

- పేరుమార్చి ప్రజలకు దూరం చేసిండ్రు
- సెక్రటేరియట్‌లోకి సీఎం సోదరుడు ఎలా వస్తడు?
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ భవనాలు కూడా పార్టీ ఆఫీసులుగా మారిపోతున్నాయని, ప్రజాభవన్‌లో పార్టీ మీటింగులు నిర్వహించటం దుర్మార్గమని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజాభవన్‌లో పీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నివాసం కోసం నిర్మించిన ప్రగతిభవన్‌ను కాంగ్రెస్ వచ్చాక ప్రజాభవన్‌గా పేరు మార్చిందని, ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని చెప్పి పార్టీ ఆఫీసుగా మార్చేసిందని దుయ్యబట్టారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రగతిభవన్‌ను పార్టీ కార్యక్రమాలకు వినియోగించడం దారుణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు స్వయంగా సెక్రటేరియట్‌లో కూర్చొని దందాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏ పదవీ లేకున్నా ఆయన సెక్రటేరియట్‌లోకి ఎలా వస్తాడని ప్రశ్నించారు?. ఏ హోదాలో కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రభుత్వమా? లేక గూండాగిరా అని నిలదీశారు.

ఇది అధికార దుర్వినియోగమే? : ఏనుగు భరత్‌రెడ్డి

ప్రజాభవన్‌లో పార్టీ సమావేశాలు నిర్వహించటం దారుణమని, ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చేశామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ నేత ఏనుగు భరత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాభవన్‌లో కాంగ్రెస్ సమావేశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తేలేదు

- కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తా
- మాజీ మంత్రి ఎర్రబెల్లి వెల్లడి

జనగామ జిల్లా పాలకుర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్, జూలై 17: తాను బీఆర్ఎస్‌ను వీడుతానని వస్తున్న వార్తల్లో నిజం లేదని, కావాలనే కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. బుధవారం ఆయన జనగామ జిల్లా పాలకుర్తిలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తానని స్పష్టంచేశారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. వానకాలం పంట పెట్టుబడి సాయం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రుణ మాఫీపై కాంగ్రెస్ పాలకులు కొర్రీలు పెడుతున్నారని మొండిపడ్డారు. అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చే వరకు ప్రజాక్షేత్రంలో ఉండి పోరాడుతామని హెచ్చరించారు. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఎర్రబెల్లి పిలుపునిచ్చారు.

అభ్యర్థుల డిమాండ్లపై తర్జనభర్జన

- గ్రూప్-2, 3 పరీక్షల వాయిదా, అదనపు పోస్టులపై తేల్చని సర్కారు
- నిరుద్యోగులతో కొలిక్కిరాని చర్చలు
- వర్గాలుగా విభజించి వేర్వేరు హామీలు?
- నిరుద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం గ్రూప్-2, 3 నోటిఫికేషన్‌లో అదనపు పోస్టులు కలపడమా? ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించే గ్రూప్ 2, నవంబర్ 17, 18 తేదీల్లో ఉన్న గ్రూప్-3 పరీక్షలు వాయిదా వేయాలా? అనే అంశాలపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నది. ఈ డిమాండ్ల సాధన కోసం నిరుద్యోగులు పోరాడుతుంటే కొందరు తటస్థంగా ఉన్నారు. ఇదే అదనుగా ప్రభుత్వం ఓ వర్గానికి ఒకలా, మరో వర్గానికి మరోలా నచ్చజెబుతూ మభ్యపెడుతున్నట్టు నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్‌లో అదనంగా పోస్టులు కలిపి, సన్నద్ధత కోసం పరీక్షలు వాయిదా వేస్తుందని కొందరు నమ్ముతుండగా.. గురువారం నుంచి మొదలయ్యే డీఎస్సీ పరీక్షలనే వాయిదా వేయని సర్కారు గ్రూప్స్‌ను ఎలా వేస్తుందని మరికొందరు వాదిస్తున్నారు. ఇటు వాయిదా, అటు పోస్టుల పెంపుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాక నిరుద్యోగులకు సతమతమవుతున్నారు.

చర్చలు జరిపినా ఫలితం శూన్యం

దాదాపు పది డిమాండ్లపై నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం తరపున కొందరు ప్రతినిధులు చర్చలు జరిపినా కొలిక్కి రాలేదని తెలిసింది. కొందరు నిరుద్యోగులతో మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు జరిపి, డీఎస్సీ వాయిదా ప్రసక్తే లేదని చెప్పినట్టు సమాచారం. గ్రూప్స్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు చెబుతున్నా.. స్పష్టత ఇవ్వలేదని నిరుద్యోగులు వాపోతున్నారు.

కొనసాగుతున్న ఉద్యమాలు..

చర్చల పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తూ ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేసే అవకాశం ఉన్నా నేటి నుంచి యథావిధిగా పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ముందుకు పోతున్నదని, ప్రభుత్వ వైఖరి చూస్తుంటే గ్రూప్-2 పరీక్షలు కూడా వాయిదా వేసే అవకాశం లేదని భావిస్తున్నారు. మరోవైపు తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాలను కొనసాగిస్తున్నారు.

ఆ ఇంజినీరింగ్ సీట్లు ఉన్నట్టా? లేనట్టా?

- జీటెక్‌లో 11 వేల సీట్లపై సందిగ్ధత
- నిరుటితో పోల్చితే తగ్గిన సీట్లు

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్లు భారీగా తగ్గాయి. కన్వీనర్ కోటాలో 11 వేలకుపైగా సీట్లకు కోతపడింది. ఈ సీట్లు ఏమయ్యాయి? ఉన్నట్టా? లేనట్టా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సందిగ్ధత కొనసాగుతుండగానే, ఆయా సీట్లను మినహాయించి శుక్రవారం ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ సీట్లను కేటాయించనున్నారు. నిరుడు ఎప్‌సెట్‌లో కన్వీనర్ కోటాలో 83,766 సీట్లు భర్తీచేశారు. ఈ ఏడాది వీటి సంఖ్య 72,741కి పడిపోయింది. కన్వీనర్, మేనేజ్‌మెంట్ నిరుడు 1.10 లక్షల సీట్లు ఉంటే, ఈ ఏడాది 1.01 లక్షల సీట్లకే పరిమితమయ్యాయి. ఇవి ఇప్పట్లో అందుబాటులోకి వస్తాయా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 11 వేల సీట్ల విషయం పెండింగ్‌లో ఉండగానే తాజాగా సర్కారు కొత్తగా ఐదు కాలేజీల్లోని కొత్త కోర్సుల్లో 3,365 సీట్లకు అనుమతినిచ్చింది. సీవీఆర్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ), ఐటీ కోర్సులు, స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్, తీగల కృష్ణారెడ్డి కాలేజీలో సీఎస్ఈ(ఏఐఎంఎల్), సీఎస్ఈ డాటా సైన్స్ కోర్సులకు అనుమతినిచ్చింది. వీటితో సీట్ల సంఖ్య 1,01,661కి చేరగా, ఇందులో కన్వీనర్ కోటా 72,741 ఉన్నాయి. సీట్ల తగ్గింపు విషయమై అధికారులను ఆరా తీయగా సీట్ల కన్వర్షన్ కోసం సర్కారు అనుమతి కోరినట్టు తెలిపారు.

- నిరుడు కంప్యూటర్ సైన్స్ (సీఎస్) ప్రోగ్రామ్‌లో 180 సీట్లు ఉండగా, ఈ విద్యా సంవత్సరంలో ఈ సీట్లు మొత్తం మాయమయ్యాయి.
- ఐటీలో నిరుడు 5,324 సీట్లుంటే, ఈసారి 1,577 సీట్లకు పరిమితమైంది.
- ఈఈఈలో 2,466 సీట్లు తగ్గాయి.